సాక్షి జగిత్యాల

శుక్రవారం । 25 । ఆగస్టు । 2023



అంధులకు చూపునిద్దాం

మరణించినా.. మన చూపు మరో ఇద్దరి దేహంలో ఈ లోకాన్ని చూసే అదృష్టం నేత్రదానంతో సాధ్యం. చీకట్లో మగ్గుతున్నవారెందరో కంటి చూపు కోసం ఎదురుచూస్తున్నారు. 8లో▸



జాతీయ జూడో పోటీలకు..

జాతీయస్థాయి జూనియర్స్ జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ పురుషుల, మహిళల జట్లను సంఘం బాధ్యులు గురువారం ప్రకటించారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్లాంటేషన్ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దివాకర

జగిత్యాల: ప్లాంటేషన్ విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ దివాకర అన్నారు. కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈనెల 26న జరిగే మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. గుంతలు తవ్వి ప్రజాప్రతినిధుల సమక్షంలో కార్యక్రమం చేపట్టాలని సూచించారు. ప్రతీ వారం సమావేశం నిర్వహించుకుని సమస్యలను పరిష్కరించేలా చూడాలన్నారు.

సమీకృత మార్కెట్‌కు మరో రూ.2.20 కోట్లు

ధర్మపురి: సమీకృత మార్కెట్‌కు మరో రూ.2.20 కోట్లు మంజూరైనట్లు సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ గురువారం ప్రకటనలో తెలిపారు. ధర్మపురి పట్టణంలో ఇంతకముందు రూ.4 కోట్ల వ్యయంతో 80 వెజ్, నాన్ వెజ్ స్టాల్స్ నిర్మించారు. మార్కెట్‌ను సకల సౌకర్యాలతో ఏర్పాటు చేసి ఇటీవల మంత్రి ఈశ్వర్ చేతుల మీదుగా ప్రారంభించిన విషయం తెలిసిందే. వీటితో పాటు మార్కెట్‌లో మరిన్ని వసతులు కల్పించడం కోసం నిధులు మంజూరు చేశారు. సదరు నిధులతో మార్కెట్ చుట్టూ కాంపౌండ్‌వాల్, సీసీరోడ్డు, డ్రైనేజీ, బాత్‌రూం, టాయిలెట్స్, ఆర్చీ తదితర పనులు చేపట్టనున్నారని పేర్కొన్నారు.

యూరియా కోసం రైతుల ఆందోళన



పొరండ్ల సహకార సంఘం గోదాం వద్ద రైతులు

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల సహకార గోదాం వద్ద రైతులు యూరియా కోసం ఆందోళన చేశారు. పొరండ్ల గోదాముకు ఒకే లారీ యూరియా రావడంతో తమకంటే తమకు అంటూ రైతులు ఒకరినొకరు తోసుకున్నారు. గత 10 రోజులుగా యూరియా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి వెంటనే యూరియా తెప్పించాలని రైతులు కోరుతున్నారు.


'మా సేవలు గుర్తించండి'



నిరసన తెలుపుతున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు

జగిత్యాలటౌన్: నేషనల్ హెల్త్ మిషన్‌లో చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న తమ సేవలను గుర్తించి రెగ్యులర్ చేయాలని ఎన్‌హెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షురాలు సింగం మాధురి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తమ ఉద్యోగాల క్రమబద్ధీకరణ కోరుతూ నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు గురువారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం తమ సమస్యలపై కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాధురి మాట్లాడుతూ, 20 ఏళ్లుగా ఎన్‌ఎచ్‌ఎం పథకంలో ఉద్యోగులుగా పనిచేస్తున్న తాము తక్కువ వేతనాలతో సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగాల క్రమబద్ధీకరణకు ఈనెల చివరి వరకు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని, ప్రభుత్వం స్పందించకుంటే నిరవధిక సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ల ఉద్యోగులు పాల్గొన్నారు.

పీఆర్సీని నియమించాలి



సభ్యత్వ నమోదులో నాయకులు

ధర్మపురి: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు వెంటనే పీఆర్సీని నియమించాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు తుంగూరు సురేశ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గజభీంకార్ గోవర్ధన్ ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం సభ్యత్వ నమోదు చేపట్టారు. మండల అధ్యక్షుడు దాసరి బీమన్న, ప్రధాన కార్యదర్శి బండారి సతీశ్ తదితరులున్నారు.

- కోరుట్లలో ఇటీవల జరిగిన బీఆర్ఎస్ నాయకుడు పోగుల లక్ష్మీరాజం హత్య కేసులోని నిందితుల్లో ఇద్దరు మినహా మిగిలిన ఏడుగురి వయసు పాతికేళ్లే. ఇందులో ఒకరికి 18 ఏళ్లు మాత్రమే. చిన్న వయసులోనే హత్యలో పాలుపంచుకున్నారు.
- మెట్‌పల్లికి చెందిన కన్నం సతీశ్‌కు 27 ఏళ్లు. యువకుల మధ్య నెలకొన్న పాత కక్షల నేపథ్యంలో నాలుగు రోజుల క్రితం జరిగిన దాడిలో సతీశ్ ప్రాణాలు కోల్పోయాడు. ఈ హత్యలో పాలుపంచుకున్న నిందితులు 25–29 ఏళ్లలోపు యువకులే.
- పదిహేను రోజుల క్రితం కోరుట్లలోని ఓ యువతి వ్యవహారంలో జరిగిన గొడవలో సమీర్ హత్యకు గురయ్యాడు. ఇందులో పాలుపంచుకున్న ఇద్దరు నిందితుల వయసు 25–28 ఏళ్లు కావడం గమనార్హం.
- నాలుగు నెలల క్రితం కోరుట్లలో ఠాకూర్ ప్రవీణ్ సింగ్ అనే యువకుడి హత్యలో పాలుపంచుకున్న వాళ్లంతా 27ఏళ్ల లోపు వయసు వారే.

'మత్తు'మే సవాల్

- మద్యం, గంజాయి, డ్రగ్స్‌కు బానిసలు
- పట్టణాలు, ప్రధాన కూడళ్లలో అడ్డాలు
- క్షణికావేశంలో గొడవలు, ఆపై హత్యలు
- ప్రతీకారంతో దారితప్పుతున్న యువత
- రోడ్డున పడుతున్న బాధిత కుటుంబాలు



మెట్‌పల్లిలో సతీశ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు(ఫైల్)

కోరుట్ల: మెట్‌పల్లి, కోరుట్ల పట్టణాల్లో ఐదు నెలల్లో జరిగిన నాలుగు హత్యల్లో నిందితులంతా 30ఏళ్ల వయసులోపు యువకులు కావడం సర్వత్రా విస్మయం కలిగిస్తోంది. అంతేకాదు.. వీరు చిత్తుగా మద్యం తాగి నేరాలకు పాల్పడటం అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది. కొందరు గంజాయి తాగి.. ఆ మత్తులో నేరాలు చేస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మద్యం, గంజాయి అడ్డాలు..

- పలు పట్టణాల్లో కొందరు యువకులు రోజూ కొన్ని ఏరియాల్లో అడ్డాలు వేస్తున్నారు.
- అక్కడ మద్యం, గంజాయి తాగి తమకు తామే బాస్‌లుగా భావిస్తున్నారు.
- అంతటితో ఆగకుండా ప్రేమ వ్యవహారాల్లో తలదూర్చడం, సినీ తరహాలో 'బాస్' సంస్కృతికి అలవాటుపడటం, ఈ క్రమంలోనే గొడవల్లో తలదూర్చి.. కేసుల్లో ఇరుక్కోవడం పరిపాటిగా మారుతోంది.
- ఇలాంటి నేర స్వభావం కలిగిన యువకులను పలువురు క్రిమినల్స్ చేరదీస్తున్నారు.
- తమ స్వలాభం కోసం భూ తగాదాలు, సెటిల్‌మెంట్లు, బెదిరింపులు, బ్లాక్‌మెయిల్ వంటి అసాంఘిక కార్యకలాపాల్లోకి దించి తమ పబ్బం గడుపుకుంటున్నారు.

అడ్రస్ లేని ఆపరేషన్ 'ఛబుత్ర'

అడ్డాలు వేసి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న యువతను నియంత్రించడానికి ఏడాది క్రితం జిల్లాలో పోలీసులు 'ఆపరేషన్ ఛబుత్ర' చేపట్టారు. మూడు నెలలపాటు హల్‌చల్ చేశారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ పట్టణాల్లో దారితప్పిన యువకులను పట్టుకున్నారు. వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేశారు. తర్వాత పోలీసులు ఈ విషయంపై పెద్దగా దృష్టి సారించడం లేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో యువత అసాంఘిక కార్యకలాపాల జోరు పెరుగుతోంది.

దిక్కుతోచని స్థితిలో..

- నేరాల్లో పాలుపంచుకుంటున్న యువత జైలుపాలవుతోంది. ఇంటి పెద్దదిక్కు లేకుండా కొందరు, కొడుకులు కటకటాల పాలై తల్లిదండ్రులు పడుతున్న వేదన అంతాఇంతా కాదు.
- మెట్‌పల్లిలో ఇటీవల హత్యకు గురైన కన్నం సతీశ్‌కు తల్లిదండ్రులు, భార్య, ఏడాదిన్నర లోపు వయసు ఉన్న ఇద్దరు కొడుకులు, కోరుట్లలో హత్యకు గురైన లక్ష్మీరాజం భార్య, పిల్లలు కుటుంబ పెద్దలను కోల్పోయి దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.
- ఈ కేసుల్లో నేరస్తులపై పీడీ యాక్ట్ నమోదవుతున్న క్రమంలో నేరాలకు పాల్పడ్డ యువకుల తల్లిదండ్రులు, బంధువులు తమ పిల్లలను జైళ్ల నుంచి విడిపించుకోలేక నరకయాతన అనుభవిస్తున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు..



జగిత్యాలక్రైం: దారి తప్పుతున్న యువతను నియంత్రించడంపై దృష్టి సారించాం. పట్టణ ప్రాంతాల్లో అడ్డాలు వేసి మద్యం తాగి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారి వివరాలు, వారి ప్రవర్తనపైనా ఆరా తీస్తున్నాం. మంగళవారం అర్ధరాత్రి జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి పట్టణాల్లో ఆపరేషన్ ఛబుత్ర కార్యక్రమం చేపట్టి అనుమానస్పదంగా తిరుగుతున్న 108 మంది యువకులను అదుపులోకి తీసుకున్నాం. 56 బైకులు, 3 కార్లు సీజ్ చేశాం. అర్ధరాత్రి 12 గంటల తర్వాత అనవసరంగా రోడ్లపైకి వచ్చే వారిపైకఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజలు, మహిళలను అభద్రతా భావానికి గురిచేస్తే న్యూసెన్స్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తాం.

– ఎగ్గడి భాస్కర్, ఎస్పీ

మత్తు పదార్థాల నిర్మూలన లక్ష్యం



జగిత్యాలక్రైం: జిల్లాలో మాదక ద్రవ్యాలు, గంజాయి వినియోగం, రవాణాను అరికట్టడమే లక్ష్యం. ఎన్‌ఫోర్స్‌మెంట్, వివిధ శాఖల అధికారుల సమన్వయంతో వీటిని నియంత్రిస్తాం. ఇటీవల సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి ఆదేశించాం. ప్రస్తుతం నార్కోటిక్, సైకోట్రోపిక్ పదార్థాల వినియోగం ఆందోళకరం. మత్తు పదార్థాల నివారణకు అందరూ కృషి చేయాలి.

– యాస్మిన్ బాషా, కలెక్టర్

కుల సంఘాల అభ్యున్నతికి కృషి



ప్రొసీడింగ్ కాపీ అందిస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

- ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

కోరుట్ల: నియోజకవర్గంలో కుల సంఘాల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. గురువారం పట్టణంలో పలు కుల సంఘాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి ప్రొసీడింగ్ కాపీలు అందించారు. శ్రీరామా మున్నూరు కాపు సంఘానికి రూ.3 లక్షలు, బుడగ జంగం కమ్యూనిటీ హాల్ నిర్మానానికి రూ.10 లక్షలు మంజూరు చేసి, భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

బ్రహ్మకుమారీ చారిటీకి రూ.5 లక్షలు..

కోరుట్ల రూరల్: మండలంలోని కల్లూరు శివారులో గల బ్రహ్మకుమారీ చారిటీకి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు రూ. 5 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు ప్రొసీడింగ్ కాపీలను చారిటీ సభ్యులకు గురువారం అందించారు. అనంతరం యూనివర్సల్ బ్రదర్‌హుడ్ డే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కల్లూర్ నుంచి మల్లాపూర్ మండలం సాతారంకు వెళ్లే లింకు రోడ్డుకు రూ.70 లక్షలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. కల్లూర్ శివారులో గల పాల చెరువు మాటు కాలువ నిర్మాణానికి రూ.2.95 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, ఎంపీపీ తోట నారాయణ, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చీటి వెంకట్రావు, సర్పంచుల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, సర్పంచ్ వనతడుపుల అంజయ్య, ఎంపీటీసీ లత తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని పతకాలు సాధించాలి



స్వప్నికను సన్మానిస్తున్న నాయకులు

ధర్మపురి: పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించి షార్జా గడ్డపై భారత త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించిన అంతర్జాతీయ క్రీడాకారిణి రంగు విరంచి స్వప్నికను గురువారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ధర్మపురి మండల జాగృతి మహిళా కన్వీనర్ రాపర్తి విజయలక్ష్మి మాట్లాడుతూ, స్వప్నిక అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించడం రాష్ట్రానికే గర్వకారణమని, రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధించాలన్నారు. అందుకు కావాల్సిన సహాయసహకారాలు జాగృతి జాతీయ అధ్యక్షురాలు కవిత దృష్టికి తీసుకెళ్లానని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ సిరంగి సంతోష్, నియోజకవర్గ కన్వీనర్ కొంక సుధీర్, మండల అధ్యక్షుడు మ్యాన పవన్‌కుమార్, యూత్ సభ్యులు కాశెట్టి విజయ్, భోగ శివప్రసాద్, సూర్‌నేని వినయ్ తదితరులున్నారు.

బతికుండగానే చంపేశారు!

- నిలిచిపోయిన పీఎం కిసాన్ సమ్మాన్ నిధి



ధ్రువపత్రంతో వెంకటేశ్

రాయికల్(జగిత్యాల): రాయికల్ మండలం కుర్మపల్లి గ్రామానికి చెందిన పుల్ల వెంకటేశ్‌కు గ్రామంలో రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి డబ్బులు 2021 వరకు మంజూరయ్యాయి. తర్వాత ఖాతాలో డబ్బులు జమకాకపోవడంతో సందేహం వచ్చిన వెంకటేశ్ మీసేవలో సంప్రదించగా చనిపోయినట్లుగా ఉండటంతో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నిలిచిపోయినట్లు చూపించింది. దీంతో అవాక్కయిన వెంకటేశ్ సంబంధిత వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. ఎక్కడో తప్పిదం జరిగిందని, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నిధులు మంజూరయ్యేలా చూస్తామని అధికారులు తెలిపారు. ఏదేమైనా తాను బతికుండగా చనిపోయినట్లుగా ఆన్‌లైన్‌లో నమోదైందని వెంకటేశ్ వాపోయాడు.

అధికారంలోకి రాగానే 'ధరణి'ని సమీక్షిస్తాం

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: ధరణి లేకుంటే రైతుబంధు లేదని, రైతు రుణమాఫీ లేదంటూ సీఎం కేసీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. రైతుబంధు ప్రారంభించేనాటికి ధరణి పోర్టల్ ప్రారంభించలేదన్న విషయాన్ని సీఎం గుర్తించాలన్నారు. భూముల ఆన్‌లైన్ రికార్డుల ప్రక్షాళన కేవలం తెలంగాణకు మాత్రమే పరిమితమైన అంశం కాదని, కర్ణాటక 2000 సంవత్సరంలో, ఆంధ్రప్రదేశ్ 2015లో భూముల ఆన్లైన్ ప్రక్రియను ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ తన ప్రభుత్వ తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అక్షాంశ రేఖాంశాల ఆధారంగా భూములకు హద్దులు నిర్ణయిస్తామని సీఎం శాసనసభ వేదికగా ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. గత ప్రభుత్వాల హయాంలో పైసా ఖర్చు లేకుండా మ్యుటేషన్లు జరుగగా ప్రస్తుతం మ్యుటేషన్‌కు ఎకరాకు రూ.2500 వసూలు చేస్తున్నారని అన్నారు. మొఘలాయిల కాలంలో జుట్టు పన్ను విధించినట్లుగా సీఎం కేసీఆర్ భూమిపై పన్ను విధిస్తున్నారని ఆరోపించారు. రైతుబంధు నెపంతో ఉమ్మడి రాష్ట్రంలో రైతులకు అందించిన అన్ని రకాల రాయితీలను ఎత్తివేశారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతుబంధు కొనసాగింపుతో పాటు గతంలో రైతులకిచ్చిన అన్ని రాయితీలను పునరుద్ధరిస్తామని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. సమావేశంలో నాయకులు గిరి నాగభూషణం, బండ శంకర్, కల్లెపెల్లి దుర్గయ్య, గాజుల రాజేందర్, పుప్పాల అశోక్, మన్సూర్, చందా రాధాకిషన్, గుండ మధు, కచ్చు హరీశ్ ఉన్నారు.

నోటిఫికేషన్ కాపీలు దహనం చేసి నిరసన



నిరసన తెలుపుతున్న ఏఎన్‌ఎంలు

జగిత్యాలటౌన్: చాలీచాలని వేతనాలతో కాలం వెల్లదీస్తూ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న తమను రెగ్యులర్ చేయాలని తెలంగాణ కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాండ్ల మధురిమ డిమాండ్ చేశారు. నిరవధిక సమ్మెలో ఉన్న కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలు 9వ రోజు గురువారం జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో ఏఎన్‌ఎంల నియామకం కోసం జూలైలో జారీ చేసిన నోటిఫికేషన్ కాపీలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మధురిమ మాట్లాడుతూ, సుదీర్ఘ కాలంగా సేవలందిస్తున్న తమను కాదని కొత్తగా నోటిఫికేషన్ జారీచేయడం సరికాదన్నారు. ఆర్టీసీ, వీఆర్‌ఏ, పంచాయతీ కార్యదర్శులు, కాంట్రాక్టు లెక్చరర్లు, ఫార్మాసిస్టులు, హెల్త్ అసిస్టెంట్లను రెగ్యులరైజ్ చేసిన ప్రభుత్వం తమపై ఎందుకు వివక్ష చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేసి ఎలాంటి ఆంక్షలు లేకుండా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గూడూరి జయప్రద, మమత, సుప్రియ, నీరజ, పద్మ, రాజమణి, మేరి, ఎలిజబెత్, శిరీష, ప్రశాంతి, శైలజ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

కన్నుపడితే ఖతమే..

- జిల్లాలో పెరుగుతున్న ద్విచక్ర వాహనాల చోరీలు
- జనసంచారం ఉన్న ప్రాంతాల్లోనే అపహరణ
- కేసుల నమోదులో పోలీసుల జాప్యం





ద్విచక్ర వాహనాలను ఎత్తుకెళ్తున్న దొంగల సీసీఫుటేజీ

సంవత్సరం	చోరీకి గురైన వాహనాలు	రికవరీ అయినవి	రికవరీ కానివి
2022	64	56	8
2023 (ఇప్పటి వరకు)	32	16	16

జగిత్యాలక్రైం: జిల్లాలోని ప్రధాన పట్టణాలతో పాటు మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను దొంగలు మాయం చేస్తున్నారు. హ్యాండిల్ లాక్ పకడ్బందీగా వేసుకున్నా అపహరిస్తుండటంతో వాహనదారుల్లో ఆందోళన నెలకొంటోంది. ఏటా రెండంకెల సంఖ్యలో వాహనాలు చోరీకి గురవుతున్నాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కొన్నింటిని మాత్రమే రికవరీ చేస్తున్నారు. కాగా కేసుల నమోదులో పోలీసులు జాప్యం చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. పోయినవాటిలో కొన్ని వాహనాల జాడ దొరకడం లేదు. ముఖ్యంగా జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోనే చోరీలు జరుగుతుండటం గమనార్హం.

పట్టణం, గ్రామం తేడా లేకుండా..

జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు, 20 మండలాల్లో 380 గ్రామపంచాయతీలు ఉన్నాయి. జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, ధర్మపురి, రాయికల్ పట్టణాలతో పాటు పలు మండలాలు, గ్రామాల్లో చోరీలు జరుగుతున్నాయి. ద్విచక్ర వాహనాల్లో ఎక్కువగా తాళాలు అరిగిపోయి ఉండటంతో ఎలాంటి తాళం చెవి పెట్టినా సులువుగా హ్యాండిల్ లాక్ తెరుచుకుంటోంది. పలు ప్రాంతాల్లో రాత్రివేళల్లో ఇంటి ఎదుట పార్క్ చేసిన బైక్‌లు ఉదయం లేచి చూసేసరికి కన్పించడం లేదు. ఆయా ప్రాంతాల్లో పొద్దంతా రెక్కీ నిర్వహించి అర్ధరాత్రి సమయంలో అపహరిస్తున్నారు. పాత వాహనాలైతే విడి భాగాలను ఊడదీసి ఇనుప సామగ్రి దుకాణంలో విక్రయిస్తున్నట్లు, పేరున్న కంపెనీ వాహనానికి చెందిన నాణ్యమైన విడి భాగాలను మెకానిక్‌లకు అమ్మేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక కొత్త వాహనాలైతే నంబర్ ప్లేట్లు తీసేసి గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ ధరకు అమ్ముతున్నట్లు, అక్కడైతే పోలీసుల పర్యవేక్షణ తక్కువగా ఉంటుందని, పట్టణాలకు వచ్చే అవసరం ఉండదు కాబట్టి ఇలా చేస్తున్నట్లు తెలుస్తోంది.

రికవరీపై ప్రత్యేక దృష్టి

చోరీకి గురైన ద్విచక్ర వాహనాలతో పాటు నేరాలను నియంత్రించేందుకు పోలీసు శాఖ జిల్లా వ్యాప్తంగా సాయంత్రం సమయంలో ప్రత్యేక వాహనాల తనిఖీ చేపడుతోంది. నంబరుప్లేట్ లేని వాహనాలతో పాటు అనుమానస్పదంగా ఉన్న వాహనాలను సీజ్ చేస్తున్నారు. దీంతో చోరీకి గురైన వాహనాలు పట్టుబడుతున్నాయి. చాలా మంది పాత నేరస్తులు పట్టుబడిన సమయంలో పోలీసుల విచారణలో ఎక్కడెక్కడ చోరీ చేశారో వెల్లడిస్తుండటంతో వెంటనే పోలీసులు కేసు నమోదు చేసి కోర్టు ద్వారా యజమానులకు వాహనాలను అందజేస్తున్నారు.

సీసీకెమెరాల ద్వారా గుర్తింపు

ముఖ్యంగా జిల్లాలో ద్విచక్ర వాహనాలను చోరీ చేసే దొంగలు పాత నేరస్తులు కావడంతో పాటు, పట్టణాల్లో దొంగలు చోరీకి పాల్పడి వాహనాలు తీసుకెళ్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అవుతున్నాయి. పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా దొంగలను పట్టుకుని వారి నుంచి వాహనాలను రికవరీ చేసి యజమానులకు అప్పగిస్తున్నారు.

అనుమతి పత్రాలు అప్‌డేట్ చేసుకోవాలి



పాత వాహనాలను కొనుగోలు చేసే సమయంలో అనుమతి పత్రాలు తప్పకుండా అప్‌డేట్ చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల చాలా వరకు చోరీకి గురైన వాహనాలను గుర్తించేందుకు అవకాశం ఉంటుంది. వాహనాల రిజిస్ట్రేషన్ సరిగ్గా లేని వారు కొద్దిరోజులు తిరిగి వదిలేస్తారు. వ్యాపార కేంద్రం, గృహ సముదాయాలు, కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. పోలీసుల నిఘా పెంచినం. నిరంతరం పెట్రోలింగ్ కొనసాగుతోంది. – ఎగ్గడి భాస్కర్, ఎస్పీ

క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి రూ.10లక్షలు మంజూరు


ఆలయం వద్ద రంగనాథంతో నాయకులు తదితరులు

మల్యాల(చొప్పదండి): మండలంలోని ముత్యంపేట గ్రామ శివారులో ఆది పెరమాండ్ల స్వామి ఆలయాన్ని గురువారం తిరుమల తిరుపతి దేవస్థానం పర్యవేక్షకుడు రంగనాథం సందర్శించారు. ఆలయ అభివృద్ధికి రూ.10లక్షల నిధులు మంజూరు చేశారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వాహకులకు, చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, ఉప సర్పంచ్ కొండబత్తిని త్రినాథ్, వార్డు సభ్యులు నర్సయ్య, నర్సింహారెడ్డి, మాదవరెడ్డి, స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడెం మండలానికి బస్సు నడిపించండి

రాయికల్(జగిత్యాల): జగిత్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును నిర్మల్ జిల్లా కడెం మండలానికి రోజూ మూడు ట్రిప్పులు నడిపేలా చూడాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి గురువారం జగిత్యాల డిపో మేనేజర్‌కు లేఖ రాశారు. జగిత్యాల నుంచి కడెం మండలానికి వర్తక వ్యాపారాలు పెరగడంతో ప్రయాణికుల సౌకర్యార్థం మూడు ట్రిప్పులు నడపాలని కోరినట్లు తెలిపారు.





అంధులకు చూపునిద్దాం



- చనిపోయినా కళ్లను సజీవంగా ఉంచొచ్చు
- అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థలు
- పదేళ్లలో ఉమ్మడి జిల్లాలో 900మంది నేత్రాలుదానం
- నేటి నుంచి జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు

కోల్‌సిటీ(రామగుండం): మరణించినా.. మన చూపు మరో ఇద్దరి దేహంలో ఈ లోకాన్ని చూసే అదృష్టం నేత్రదానంతో సాధ్యం. చీకట్లో మగ్గుతు


మరణించిన వ్యక్తి నుంచి నేత్రాలు సేకరిస్తున్న టెక్నీషియన్ (ఫైల్)

న్నవారెందరో కంటిచూపు కోసం ఎదురుచూస్తున్నారు. దీనిపై ఏటా ఆగస్టు 25వ తేదీ నుంచి సెప్టెంబర్ 8 వరకు ప్రభుత్వాలు జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నాయి. చనిపోయిన తర్వాత నేత్రాలు భూమిలో కలిసిపోకుండా.. మంటల్లో కాలిబూడిదవకుండా ఉండేందుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నేత్రదానంపై సదాశయ ఫౌండేషన్(94927 81306), లయన్స్ క్లబ్(98491 06589), తెలంగాణ నేత్ర, అవయవ, శరీరదాతల సంఘం(73969 24667) తదతర స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వాలు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో గత పదేళ్లలో 900 మంది నేత్రదానం చేసి, 1,800 మందికి చూపునిచ్చారు. నేత్ర దానానికి 60 వేల మందికి పైగా ప్రతిజ్ఞ చేయగా ఇప్పటివరకు 1,500 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

నేత్రదానం ఎవరైనా చేయవచ్చు

నేత్రదానం చేయడానికి వయసు పరిమితులు లేవు. కళ్లజోడు పెట్టుకునేవారు, అధిక బీపీ, మధుమేహం, ఉబ్బసం వ్యాధులు ఉన్నవారు, కంటి శుక్లాల(కేటరాక్టు) ఆపరేషన్ చేయించుకున్నవారు కూడా చేయవచ్చు. హైపటైటిస్, ఎయిడ్స్ తదితర వ్యాధులున్నవారు మాత్రం చేయకూడదు. కళ్లను దానం చేయడానికి స్వచ్ఛంద సంస్థలకు, ఐ బ్యాంకులకు సమాచారం ఇవ్వాలి.

కొన్ని సందర్భాల్లో నలుగురికి చూపునివ్వొచ్చు

మనం మరణించినా.. మన నేత్రాలు మాత్రం సజీవంగానే ఉండాలంటే నేత్రదానం ఒక్కటే మార్గం. కళ్లను తీసిన తర్వాత ఐ బ్యాంకులో విశ్లేషించి, ప్రాసెస్ చేస్తారు. కార్నియాను 96 గంటల్లోపు ట్రాన్స్‌ప్లాంట్ చేస్తారు. ఐ బ్యాంకులు మానవ అవయవ మార్పిడి చట్టం పరిధిలోకి వస్తాయి. ఒకరు దానం చేసిన రెండు నేత్రాలతో కొన్ని సందర్భాల్లో నలుగురికి కంటిచూపు ప్రసాదించే అవకాశం ఉంటుంది. మిగతా సాధారణ సందర్భాల్లో మాత్రం ఇద్దరికి చూపు వచ్చేలా చేయొచ్చని వైద్యనిపుణులు చెబుతున్నారు. రెండేళ్ల క్రితం మరణించిన కన్నడ పవర్ స్టార్ పునీత్ రాజ్‌కుమార్ కళ్లతో నలుగురు అంధులకు చూపునిచ్చారు.

ఇవి పాటించడం తప్పనిసరి

వ్యక్తి మరణించిన 6 గంటల్లోపు నేత్రాలను తీయాలి. ఐ బ్యాంకు డాక్టర్ గానీ, శిక్షణ పొందిన టెక్నీషియన్ మాత్రమే స్టెరైల్ పద్ధతిలో కార్నియాను బయటకు తీస్తారు. వీరు మృతదేహం ఉంచిన చోటుకే వచ్చి, రక్తస్రావం లేకుండా 15 నుంచి 20 నిమిషాల్లో కళ్లు సేకరిస్తారు. మరణించిన వ్యక్తి నుంచి నేత్రాలను దానం చేయాలనుకుంటే మృతదేహం దగ్గర ఫ్యాన్లు ఆపేయాలి. ఏసీ, కూలర్లు ఉంటే ఆన్ చేయాలి. తడిపిన దూదిని ఐస్‌తోపాటు మూసిన కళ్లపై ఉంచాలి. తలకింద తలగడ పెట్టి ఎత్తుగా ఉండేలా చూడాలి.

మా అమ్మ కళ్లు దానం చేశాం



మా అమ్మ మల్లమ్మ అనారోగ్యంతో మృతిచెందగా, ఆమె కళ్లను దానం చేశాం. అవి మరో ఇద్దరి దేహంలో సజీవంగా ఉండి, ఈ లోకాన్ని చూస్తున్నాయని ఆనందంగా ఉంది. నేను కూడా నేత్రదానం చేస్తానని అంగీకారపత్రం ఇచ్చాను.
– కొంకటి లక్ష్మీనారాయణ, మాజీ మేయర్, రామగుండం

నేత్రదానంతో చూపు సజీవం



మరణించినా నేత్రదానంతో ఈ లోకాన్ని చూడొచ్చు. మనిషి మరణించాక నేత్రదానం చేయండి. దీనివల్ల చూపు సజీవంగా ఉంటుంది. ఇంతకంటే గొప్ప దానం మరొకటి లేదు. అపోహలు వీడి, అందరూ ముందుకు రావాలి.
– శ్యాంప్రసాద్‌లాల్, అదనపు కలెక్టర్, పెద్దపల్లి

12 మంది నుంచి సేకరించాం



రామగుండం లయన్స్ ఆధ్వర్యంలో నేత్రదానంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. ఇటీవల మరణించిన 12 మంది కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ చేసి, నేత్రాలు సేకరించాం. దీనివల్ల 24 మందికి కంటి చూపు వచ్చేలా చేశాం.
– తానిపర్తి విజయలక్ష్మి, అధ్యక్షురాలు, రామగుండం లయన్స్ క్లబ్

ప్రత్యేక చట్టం తీసుకురావాలి



నేత్రదానంపై ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకురావాలి. కొన్ని దేశాల్లో మృతదేహాలను అక్కడి ప్రభుత్వాలు స్వాధీనం చేసుకొని, అవయవాలను ఇతరులకు అమర్చేలా చూస్తున్నాయి. మా ఫౌండేషన్ ద్వారా 900 మంది మృతుల నుంచి కళ్లు సేకరించాం. సెలబ్రిటీలు సమాజహితం కోసం ముందుకు రావాలి.
– సీహెచ్.లింగమూర్తి, ప్రధాన కార్యదర్శి, సదాశయ ఫౌండేషన్

ఎస్‌కేఎన్‌ఆర్ విద్యార్థుల ప్రతిభ

జగిత్యాల: పీజీ ప్రవేశ ఫలితాల్లో జగిత్యాల ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అశోక్ మాట్లాడారు. కృష్ణవేణి 112, వనిత 704, తిరుపతి 197, మానస 330, సాయిచరణ్ 476, గిరిధర్ 439, దివ్య 1,365, రోహిత్ 1,373, కె.రోహిత్ 1,991, తరుణ్ 1,563 ర్యాంకులు సాధించారని, కళాశాలకే ఎంతో గర్వకారణమన్నారు. విద్యార్థులను అభినందించి పట్టుదలతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, గోవర్దన్, కరుణాకర్, ఎల్జిబెత్‌రాణి, ప్రకాశ్, వేణు, రాజేశ్ పాల్గొన్నారు.

సత్తాచాటిన 'రామకృష్ణ' విద్యార్థులు

కోరుట్ల: పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల విద్యార్థులు పీజీ ప్రవేశ పరీక్షలో ప్రతిభ చాటారని


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ప్రిన్సిపాల్ బెజ్జారపు ప్రవీణ్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ జువాలజీలో ఎక్కల్‌దేవి కీర్తన రాష్ట్రస్థాయి 10వ ర్యాంకు, మ్యాథ్స్‌లో జక్కుల రమ్య 184, ఎమ్‌కాంలో సిరికొండ వందన 369, ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్‌లో రవితేజ 597వ ర్యాంకు సాధించారని పేర్కొన్నారు. వీరిని కరస్పాండెంట్ రామకృష్ణా, డైరెక్టర్లు హరిప్రియ, అంజయ్యగౌడ్, అధ్యాపకులు అభినందించారు.

బీసీలపై రాజకీయ పార్టీల వైఖరి మారాలి

- బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేశ్ చారి

కరీంనగర్: బీసీలపై రాజకీయ పార్టీలు సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నాయని, ఈ వైఖరి మార్చుకోకపోతే వచ్చే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్తామని బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేశ్ చారి హెచ్చరించారు. గురువారం కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ ఎదుట ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి జీఎస్. ఆనంద్ మాట్లాడుతూ.. జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు బీఆర్‌ఎస్ కేవలం 23 సీట్లు, అర శాతం ఉన్న అగ్రవర్ణాలకు 60 సీట్లు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బీసీలకు 60 సీట్లు, ముఖ్యమంత్రి పదవిని కేటాయించే పార్టీలకు తమ సంఘం తరఫున మద్దతు తెలుపుతామని అన్నారు. సెప్టెంబర్ 10న సామాజిక న్యాయం, సబ్బండ కులాలకు రాజ్యాధికారం దక్కాలని జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణల


నిరసన తెలుపుతున్న బీసీ విద్యార్థి నాయకులు

ఆధ్వర్యంలో నిర్వహించే బీసీల సింహగర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 27న సింహగర్జన సన్నాహక సమావేశం ఉంటుందని, బీసీ సంఘాల నాయకులు హాజరై, విజయవంతం చేయాలని కోరారు. బీసీ మహిళా సంఘం అధ్యక్షురాలు గంగిపెల్లి అరుణ, జిల్లా ప్రధాన కార్యదర్శులు రాచమల్ల రాజు, దొగ్గలి శ్రీధర్, అధికార ప్రతినిధి దుంపట మురళి, జిల్లా ఉపాధ్యక్షులు శానగొండ వాసు, గొడిశెల రమేశ్, యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్, నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి


సమావేశంలో నాయకులు

- కర్నాటక ఎమ్మెల్సీ బీజీ పాటిల్

జగిత్యాలరూరల్: కేంద్ర సంక్షేమ పథకాలను ప్రతీ కార్యకర్త ఇంటింటా వివరించాలని కర్నాటక ఎమ్మెల్సీ బీజీ పాటిల్ అన్నారు. గురువారం జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధాని మోదీ నిరుపేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుంచుతామని, కార్యకర్తలంతా సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జూడో పోటీలకు తెలంగాణ జట్లు

- 28 నుంచి సెప్టెంబర్ 1వరకు ఢిల్లీలో పోటీలు
- జాబితా ప్రకటించిన అనంతరెడ్డి, జనార్దన్‌రెడ్డి

కరీంనగర్‌స్పోర్ట్స్: జాతీయస్థాయి జూనియర్స్ జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ పురుషుల, మహిళల జట్లను రాష్ట్ర జూడో సంఘం ఉపాధ్యక్షుడు కడారి అనంతరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి గురువారం ప్రకటించారు. ఈ నెల 19, 20 తేదీల్లో కరీంనగర్‌లో జరిగిన 8వ రాష్ట్రస్థాయి జూనియర్స్ జూడో పోటీల్లో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులను జాతీయస్థాయికి ఎంపిక చేశారు. ఢిల్లీలో ఈ నెల 28నుంచి సెప్టెంబర్ 1వరకు జాతీయస్థాయి పోటీలు జరగనున్నట్లు తెలిపారు.

పురుషుల జట్టు

ఎస్.డెంజిల్ (ఆదిలాబాద్, 55కేజీ లోపు), పి.శివాజీ(యాదాద్రి, 60కేజీలోపు), టి.శివకుమార్ (యాదాద్రి, 66కేజీలోపు), అనాస్‌ఖాన్(హైదరాబాద్, 73కేజీలోపు), టి.రోహన్ సింగ్ (వరంగల్, 81కేజీలోపు), టి.భువనేశ్వర్ సింగ్ (వరంగల్, 90కేజీ లోపు), షేక్ ఫైజాన్ (హైదరాబాద్, 100కేజీ లోపు), టి.సాయిపుత్రనాథ్ (హైదరాబాద్, 100కేజీ పైన).

మహిళల జట్టు

కె.దీపిక (వరంగల్, 44కేజీ లోపు), కె.అనూష (వరంగల్, 48కేజీ లోపు), ఆర్.చాందిని (ఆదిలాబాద్, 52కేజీలోపు), బి.స్పందన (వరంగల్, 57కేజీ లోపు), పి.వసుధ (ఆదిలాబాద్, 63కేజీలోపు), నరేస్‌సుల్తానా (హైదరాబాద్, 70కేజీలోపు), హుమేరాబేగం (హైదరాబాద్, 78కేజీ లోపు), డి.నక్షత్ర (78కేజీ పై).

పోలీసుల అదుపులో వ్యక్తి

మేడిపెల్లి(కోరుట్ల): మేడిపెల్లి రహదారి పక్కన గల రెండు ఏటీఎంలలో మంగళవారం చోరీకి విఫల యత్నం చేసిన కేసులో ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.



ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే

జగిత్యాల: బీఆర్‌ఎస్ జగిత్యాల నియోజకవర్గ అభ్యర్థిగా సీఎం కేసీఆర్ ప్రకటించడంపై గురువారం ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు దామోదర్‌రావును ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే జగిత్యాల నియోజకవర్గానికి మరిన్ని నిధులు కేటాయించాలని వారిని కోరారు.


కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యే

బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి


సభ్యత్వ నమోదు పత్రాలు ఇస్తున్న స్వామి

మల్లాపూర్(కోరుట్ల): 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీపెరంబుదూర్ లింబగిరి స్వామి అన్నారు. గురువారం మండలంలోని మొగిలిపేట, రాఘవపేట, ముత్యంపేట గ్రామాల్లో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్యతో కలిసి పాల్గొన్నారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులను ప్రభుత్వం చిన్నచూపు చూడడం తగదన్నారు. 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, వారిని స్థానికత ఆధారంగా స్వస్థలాలకు పంపించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో దీర్ఘకాలికంగా ఉన్న పెండింగ్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిటికేసి మహేశ్‌కుమార్, నాయకులు శంకర్, గణేష్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఆ రైతులకు రుణమాఫీ చేయండి'

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని పెంబట్ల–కోనాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ పరిధిలో రుణమాఫీకి అర్హత ఉండి అమలు కాని రైతులకు న్యాయం చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ గురువారం రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ రఘునందన్‌రావును కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయా బ్యాంకుల పరిధిలోని రైతులకు మొన్నటి వరకు రూ.99,999 వరకు రుణ మాఫీ అమలు చేసిన విషయం తెలిసిందే. కాగా పెంబట్ల–కోనాపూర్ సహకార సంఘంలో 175 మంది రైతులకు లబ్ధి జరగలేదు. దీనిపై ఎమ్మెల్యే, సహకార సంఘం అధ్యక్షుడు గుర్నాథం మల్లారెడ్డితో కలిసి కమిషనర్ కలిశారు. 175 మంది రైతులకు రూ. 84 లక్షల వరకు మాఫీ కావల్సి ఉందని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన కమిషనర్ సాంకేతిక కారణాలతో ఆలస్యం జరిగిందని, తక్షణమే రుణమాఫీ అమలయ్యేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

చంద్రయాన్‌తో అగ్రగామిగా నిలిచిన భారత్


మాట్లాడుతున్న వివేక్

ధర్మపురి: ప్రధాని నరేంద్రమోదీ ఆలోచనతో ఏర్పాటు చేసిన చంద్రయాన్–3 విజయంతో ప్రపంచంలో భారత్ అగ్రగామిగా నిలిచిందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, పెద్దపెల్లి మాజీ ఎంపీ గడ్డం వివేకానంద అన్నారు. ధర్మపురి పట్టణంలోని ఎస్‌ఆర్‌ఆర్ ఫంక్షన్ హాలులో గురువారం యూపీలోని ఖుషినగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పీఎస్ పాఠక్, నియోజకవర్గ ఇన్‌చార్జి కస్తూరి సత్యంతో కలిసి మాట్లాడారు. మోదీ పాలనలో దేశంలో జీడీపీ గ్రాఫ్‌రేట్ పెంచుతూ నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించారని, మూడున్నర లక్షల కోట్లతో జాతీయ రహదారుల నిర్మాణం, ప్రధానమంత్రి ఆవాజ్ యోజన కింద 3 కోట్లకు పైగా ఇండ్లు నిర్మించి ఇచ్చారని వివరించారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ ఇష్టారీతిన హామీలిచ్చి చేపట్టిన అమలు తీరుపై తెలుసుకోవడం జరుగుతుందని, ప్రభుత్వ పనితీరు, గ్రామాల్లో రాజకీయాలు, పార్టీల బలాలు, బలహీనతలు తదితర వాటిని పరిశీలించడం జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో అధిష్ఠానం ఆదేశాల మేరకు ఎమ్మెల్యే బరిలో ఉంటానని చెప్పారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు గాజుల మల్లేశం, అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం, రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, మంచె రాజేష్, నాయకులు బెజ్జారపు లవన్‌కుమార్, సంగెపు గంగారాం, ఆకుబత్తిని తిరుపతి, గాజు భాస్కర్, ఆకుల శ్రీనివాస్ తదితరులున్నారు.

రూ.3 లక్షలతో ఉడాయించిన గల్ఫ్ ఏజెంట్

- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

కథలాపూర్(వేములవాడ): కువైట్ దేశంలో మంచి కంపెనీలో ఉపాధి చూపిస్తామని నమ్మబలికిన గల్ఫ్ ఏజెంట్.. వీసాల కోసం డబ్బులు తీసుకొని, మోసం చేశాడని పలువురు బాధితులు గురువారం కథలాపూర్ పోలీసులను ఆశ్రయించారు. వారి వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లికి చెందిన గల్ఫ్ ఏజెంట్ అక్కడే ఓ ట్రావెల్స్ నిర్వహిస్తున్నాడు. గతేడాది అక్టోబర్‌లో కువైట్ పంపిస్తానని కథలాపూర్ మండలంలోని భూషణరావుపేటకు చెందిన 10 మంది యువకుల వద్ద రూ.30 వేల చొప్పున రూ.3 లక్షలు తీసుకున్నాడు. నెలలు గడిచినా వీసాలు ఇవ్వకపోవడం, డబ్బులు అడిగితే సరిగా స్పందించకపోవడంతో బాధితులు ఇటీవల డిచ్‌పల్లికి వెళ్లి, ఆరా తీశారు. ఆ ట్రావెల్స్ మూసేసి ఉండటంతో తాము మోసపోయామని గ్రహించారు. ఏజెంట్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితులు ఫిర్యాదు చేసినట్లు పోలీసులకు తెలిపారు.